

సగానికిపైగా విద్యావంతులే..

ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో సగానికిపైగా అభ్యర్థులు విద్యాధికులే ఉన్నారు. డిగ్రీ, పీజీ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసినవారే. పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్రులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 10లో ▸

భైంసాలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

భైంసాటౌన్: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకులు రవిరంజన్‌కుమార్ విక్రమ్, వ్యయ పరిశీలకులు శ్రేయస్ కేఎం శుక్రవారం పరిశీలించారు. కిసాన్‌గల్లీ శ్రీ సరస్వతి శిశుమందిర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలతోపాటు మాటేగాం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. వారివెంట ఆర్వో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /19.1

చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరిగింది.

న్యూస్‌రీల్

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి



ఈవీఎం గదులను పరిశీలిస్తున్న అబ్జర్వర్

ముధోల్: ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలని జనరల్ అబ్జర్వర్ రవీరంజన్ కుమార్ విక్రం సూచించారు. ముధోల్‌లోని ఈవీఎంలను భద్రపర్చిన ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఆయన వెంట పరిశీలకులు శ్రేయస్, పోలీస్ అబ్జర్వర్ లక్ష్మణ్ నింబర్గ్, రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి ఉన్నారు.

నేడు భైంసాకు బండి సంజయ్



సిద్ధం చేసిన సభా వేదిక

భైంసాటౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ శనివారం భైంసాకు రానున్నారు. పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ మేరకు సభావేదిక వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభ విజయవంతం చేయాలని ముధోల్ బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ కోరారు.

ఓటే ఆయుధం



అవగాహన కల్పిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: ఓటు ప్రతీ పౌరుడి ఆయుధమని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మద్యం, డబ్బు, ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. ఓటు విలువ తెలుసుకుని స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకుంటేనే భావితరాలకు బంగారు బాటలు వేసుకోవచ్చని సూచించారు. ఆలోచించి దేశ భవిత కోసం ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శి యోగేష్, టీఏలు మాధురి, జైసింగ్, శశిధర్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, ఎఫ్ఏ వాణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి పనిచేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ననుసరించి ఎన్నికల నిబంధనలకు లోబడి అధికారులు పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ సూచించారు. తన చాంబర్‌లో ఐటీ అధికారి ఈశ్వర్ ప్రసాద్, ఎల్‌డీఎం చంద్రశేఖర్‌కు శుక్రవారం పలు సూచనలు, సలహాలు చేశారు. రూ.లక్షకుపైగా జరిగిన లావాదేవీల వివరాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ముఖ్యంగా రూ.10 లక్షలకు పైగా జరిగే బ్యాంక్ లావాదేవీలను ఆదాయ పన్నుశాఖ పర్యవేక్షిస్తుందని, లక్షకు పైగా అనుమానాస్పద లావాదేవీలు పరిశీలనలోకి వస్తాయన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు కలిగి ఉంటే చెల్లుబాటు అయ్యే పత్రాలను తమ వెంట తీసుకెళ్లాలన్నారు. అన్ని బ్యాంకులు తమ వద్ద ఉన్న అనుమానాస్పద డాటాను ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అందించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ లావాదేవీలపై గట్టి నిఘా ఉన్నందున ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సూచించారు.

అగ్రనేతలొస్తున్నారు..



- జిల్లాకు వరుసగా కీలక నేతల రాక
- జోరుగా బహిరంగ సభలు
- నేడు భైంసాకు బండి సంజయ్..
- రేపు ఖానాపూర్‌కు ప్రియాంకగాంధీ
- నాలుగోవారంలో మోదీ, రాహుల్, కేసీఆర్

నిర్మల్: ఎన్నికల పుణ్యాన జిల్లాకు పెద్దపెద్ద అతిథులొస్తున్నారు. ఎన్నికల సమరంలో భాగంగా తమ పార్టీ గెలుపు కోసం ఇక్కడి దాకా విచ్చేస్తున్నారు. వారి రాకతో తమ గెలుపు సులువుగా మారుతుందని స్థానిక అభ్యర్థులూ భావిస్తున్నారు. మొత్తం మీద ఈ వారం పదిరోజులపాటు జిల్లాలో సభాసమరం సాగనుంది. ఇప్పటికే ఒక దఫా సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వచ్చివెళ్లారు. ఇక బీజేపీ నుంచి ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే రానున్నారు. కాంగ్రెస్ కూడా తగ్గేదిలేదన్నట్లు రాహుల్, ప్రియాంకగాంధీలను రప్పిస్తోంది. ఈనెలాఖరు వరకు మరోసారి సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తారని బీఆర్‌ఎస్‌వర్గాలు చెబుతున్నాయి.

తమవైపు తిప్పుకునేలా..

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు శ్రమిస్తున్నారు. ఓవైపు నిత్యం ప్రచారం చేస్తూనే అప్పుడప్పుడు భారీ బహిరంగ సభలు, రోడ్‌షోలతో ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో బహిరంగ సభకు కనీసం 30 వేల నుంచి 50వేల వరకు జనసమీకరణ ఉండేలా చూసుకుంటున్నారు. బహిరంగసభ ఎంత సక్సెస్ అయితే అంత బాగా తమ పార్టీ జనాల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. సభ తర్వాత కనీసం రెండు మూడురోజులపాటు దాని ప్రభావం ఓటర్లపై ఉంటుందన్న నమ్మకంతో ఎన్నికల వేళ పార్టీలు భారీ సభలను ప్లాన్ చేస్తున్నాయి. గత ఎన్నికల్లో జిల్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, రాహుల్‌గాంధీ, మాయావతి వంటి హేమాహేమీలు వచ్చారు.

నేడు భైంసాకు బండి..

బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న ఎంపీ బండి సంజయ్ శనివారం భైంసా రానున్నారు. ముధోల్ నియోజకవర్గంపై బండి సంజయ్ ముందు నుంచి దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా తన ఐదోవిడత ప్రజాసంగ్రామయాత్ర ఇక్కడి నుంచే మొదలుపెట్టారు. ఇటీవల జన్నారంలో నిర్వహించిన ఎన్నికల బహిరంగసభలో పాల్గొన్నారు. తాజాగా శనివారం భైంసాలో బహిరంగసభతోపాటు నిర్మల్‌లో రోడ్‌షో అనుకున్నప్పటికీ పార్టీ మేనిఫెస్టో విడుదల కారణంగా నిర్మల్ పర్యటన వాయిదా వేశారు.

తొలిసారి ప్రధాని మోదీ..

దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి నిర్మల్ రానున్నారు. అసలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రావడమే మొదటిసారి. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరడానికి ఆయన ఈనెల 27న నిర్మల్‌కు రానున్నట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. ఇటీవలే నిజామాబాద్ వరకు వచ్చిన మోదీ తాజాగా నిర్మల్ రానుండటం విశేషం. రాష్ట్రంలో గెలిచేందుకు అవకాశాలు ఉన్న నియోజకవర్గాల్లో మోదీ సభలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్‌తోపాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో పార్టీ గెలిచే అవకాశాలు ఉన్నాయని కమలనాథులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలోనే నిర్మల్ కేంద్రంగా నిర్వహించనున్న సభకు మోదీ రానున్నారని పేర్కొంటున్నారు.

జిల్లాకు మళ్లీ కేసీఆర్..

ఈనెల 2న నిర్మల్, 3న భైంసాలో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్ మళ్లీ జిల్లాకు రానున్నారు. ఈనెల చివరివారంలో 26న ఖానాపూర్ షెడ్యూల్ ఖరారైనట్లు సమాచారం. ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం మంత్రి కేటీఆర్ జన్నారం వచ్చారు. చివరివారంలో కేసీఆర్ సభతోపాటు మంత్రి కేటీఆర్ రోడ్‌షో కూడా ఖానాపూర్, నిర్మల్‌లో ఉండొచ్చని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

రాహుల్, ప్రియాంకగాంధీలు..

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడిస్తామంటున్న కాంగ్రెస్‌కు మద్దతుగా పార్టీ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకగాంధీ రంగంలోకి దిగారు. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గానికి ఆదివారం ప్రియాంకగాంధీ రానున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. స్థానిక సుర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించనున్న సభలో ఆమె పాల్గొననున్నారు. ఈనెల చివరివారంలో నిర్మల్‌కు రాహుల్‌గాంధీ రానున్నట్లు చెబుతున్నారు. జిల్లాకేంద్రంలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లకు ప్లాన్ చేసుకుంటున్నారు.

ఖానాపూర్ దత్తత తీసుకుంటా



సభకు హాజరైన ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ..

- తమ్ముడు జాన్సన్‌ను గెలిపించండి
- ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- టైగర్ జోన్ నిబంధనల సడలింపునకు హామీ

జన్నారం: 'నా తమ్ముడు జాన్సన్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా'నని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండల కేంద్రంలోని మనోహర్‌రావు మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్, జెడ్పీ చైర్మన్ జనార్దన్‌రాథోడ్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్‌రావు కేటీఆర్‌కు స్వాగతం పలికారు. సభలో కేటీఆర్ మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ బలపర్చిన జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చాక జన్నారం ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచుతామని, డివైడర్లతో సెంట్రల్ లైటింగ్‌సిస్టం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. టైగర్‌జోన్ నిబంధనలు సడలించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రత్యర్థులపై విసుర్లు

ఓ వైపు హామీలు ఇస్తూనే కేటీఆర్ ప్రత్యర్థులపై విమర్శలు కురిపించారు. రాష్ట్రంలో ఎవ్వరేమి చేసుకున్నా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీజేపీ అభ్యర్థి రాథోడ్ ఏమో చేస్తానని హామీలు ఇస్తున్నా వారితో ఏమీ జరగదని విమర్శించారు. 'కన్నతల్లికి అన్నం పెట్టనోడు, చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా' అన్నట్లు బీజేపీ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మతతత్వ పార్టీలను దగ్గరకు రానీయొద్దని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ప్రతీ విషయానికి ఢిల్లీకి వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. టికెట్ల కేటాయింపులో, బీఫాం ఇవ్వడంలో ఢిల్లీకి వెళ్లినట్లు రేపు హామీలు అమలు చేయాలంటే ఢిల్లీ పెద్దలు చెప్పినట్లు వింటారని అన్నారు.

పోటెత్తిన జనాలు

సభకు బీఆర్‌ఎస్ నాయకుల అంచనా కంటే అధికంగా పోటెత్తారు. నియోజకవర్గంలో 40వేల మంది హాజరవుతారని అంచనా వేయగా 60వేలకు పైగా వచ్చారు. సభలో స్థలం లేకపోవడంతో కొందరు బయట నిల్చోవడం కనిపించింది. సభ విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

పార్టీలో చేరికలు

మంత్రి కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ, వైఎస్సార్‌టీపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, వైఎస్సార్‌టీపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సిరికొండ లక్ష్మి, బీజేవైఎం మంచిర్యాల జిల్లా నాయకుడు కొండపల్లి మహేశ్, మాజీ జెడ్పీటీసీ గణేశ్ రాథోడ్, ఎస్సీసెల్ కన్వీనర్ వీరేందర్, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్, ఎంపీటీసీ శ్రీదేవి, సిరికొండ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, కవ్వాల్ ఎంపీటీసీ సౌజన్య, మహ్మద్ సాబీర్, ఆయా పార్టీ నాయకులు పార్టీలో చేరగా కేటీఆర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీ వెంకటేశ్ నేత, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీలు చంద్రశేఖర్, జానుబాయి, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఉప సర్పంచ్ శ్రీనివాసగౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజొద్దీన్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, పొనకల్ పీఏసీఎస్ చైర్మన్ రమేశ్ వివిధ మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జాన్సన్‌నాయక్‌తో కలిసి కేటీఆర్ అభివాదం..

సమస్యలు చూడన్న: భుక్య జాన్సన్ నాయక్

ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సదర్‌మాట్ అభివృద్ధి, కడెం ప్రాజెక్టు పటిష్టత, టైగర్‌జోన్ నిబంధనల సడలింపు, ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి పెంపుపై విన్నవించారు. జన్నారం మండలానికి డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

నిశీధి ఓట్ల వేట..!

- పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల ప్రత్యేక దృష్టి
- రాత్రివేళ ప్రచారానికి నాయకుల ప్రణాళికలు
- వీధుల్లో, కాలనీల్లో సాయంకాల సమావేశాలు

నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా కొనసాగుతోంది. ప్రధానంగా రాజకీయ కేంద్ర బిందువైన నిర్మల్‌లో త్రిముఖ పోరు నెలకొంది. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల నుంచి కిందిస్థాయి నాయకుల వరకు అనేక యత్నాలు చేస్తున్నారు. పగలంతా షెడ్యూల్ ప్రకారం ప్రచారం నిర్వహిస్తుండగా, రాత్రులు ఓట్ల కోసం వేట సాగిస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లను ప్రశాంతంగా కలుసుకునేందుకు రాత్రి 9 గంటల తర్వాత సరైన సమయంగా పార్టీల ప్రధాన నాయకులు భావిస్తున్నారు. ఇదే లక్ష్యంగా నిశీధిలో ఓటు కోసం వేట మొదలుపెట్టారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో వీధి వీధిలో ఆయా పార్టీల నాయకులు గ్రామస్థాయి లీడర్ల సహాయంతో సమావేశం ఏర్పాటు చేసి తమ పార్టీకి ఓటు వేయాలని ఒప్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఏం చేశారు.. ఇక ముందు ఏం చేస్తారు.. తమకేంటి ప్రయోజనం వంటి ప్రశ్నలు ఓటర్ల నుంచి వస్తున్నట్లు తెలుస్తోంది. పల్లెల్లో పెద్దమనిషి తరహా వ్యక్తుల్ని ఆయా పార్టీల నాయకులు ప్రసన్నం చేసుకుని వారి ద్వారా తమ పోల్ మేనేజ్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మీ ఊరికి, మీకాలనీకి ఏం కావాలి.. ఎలాంటి పనులు అవసరం ఉందో లిస్టు తయారుచేసి ఇవ్వాలని తగిన విధంగా పనులు చేసిపెట్టే బాధ్యత తమదేనని హామీలు ఇస్తున్నారు. రోజూ సాయంత్రం అయితే చాలు ఆయా గ్రామాల్లోని బూత్ లెవెల్ కమిటీల ద్వారా సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇందులో గ్రామ, మండలస్థాయి కీలక నాయకులు పాల్గొని ఓటర్లకు ఏం కావాలో అడిగి తెలుసుకుని అభ్యర్థి తరఫున వాగ్దానం చేస్తున్నారు. వీలైతే మందు, విందు పార్టీలు ఏర్పాటు చేసేందుకు కూడా ప్రణాళికలు రచిస్తున్నారు.

ఓటరు నాడి తెలిసేది ఇక్కడే...

సాయంత్రం సమావేశాల్లోనే ఓటరునాడిని కనిపెట్టవచ్చని ఆయా పార్టీల అభ్యర్థుల తరఫు అనుచరులు, ద్వితీయశ్రేణి నాయకులు భావిస్తున్నారు. ప్రచార రథాలపై ఎంత ఊదరగొట్టినా, సభలు సమావేశాలు, రోడ్‌షోలు, కుల సంఘాల సమావేశాలు ఎన్ని ఏర్పాటు చేసినా చివరికి ఓటరునాడి తెలిసేది వ్యక్తిగతంగా కలిసి మాట్లాడినప్పుడేనని భావిస్తున్నారు. ఇలా పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతీ గ్రామం, పట్టణంలోని గల్లీగల్లీ ఇలా బూత్ లెవల్ స్థాయిలో ఆయా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యక్తిగతంగా కూడా తమ ఉద్దేశం ఏంటని అడిగి తెలుసుకుంటున్నారు. ఒక్కో పార్టీ ఒక్కో రోజు క్షేత్రస్థాయిలో రాత్రి వరకు సమావేశాలు ఏర్పాటు చేసి తమ పార్టీ హామీలను, ఓటర్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఓటరు నాడి దొరకబుచ్చుకునేందుకు ఇదే అదును అని భావిస్తున్నారు.



ఓటరు జాబితాల వారీగా..

పట్టణ ప్రాంతాలను అయితే కాలనీల వారీగా, గ్రామీణ ప్రాంతాల్లో అయితే పోలింగ్ బూత్ వారీగా జాబితాను దగ్గర ఉంచుకుమరీ ఒక్కొక్క ఓటరు వివరాలకు ఆరా తీస్తున్నారు. గ్రామంలో ఉన్న ఓటర్లు ఎందరూ.. ప్రస్తుతం గ్రామంలో నివసించని ఓటర్ల ఫోన్ నంబర్లను సేకరించి పోలింగ్ రోజు తప్పక రావాలని ఫోన్‌చేసి కోరుతున్నారు. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు ఉపాధి, బతుకుదెరువు నిమిత్తం వెళ్లిన వారితో ప్రత్యేకంగా మాట్లాడి పలురకాల తాయిలాలు, పోలింగ్‌రోజు వచ్చేందుకు ఖర్చులకు ఇచ్చేందుకు కూడా సుముఖత వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ తేదీ నాటికి ఓటర్లను తమవైపు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సమాచారం సేకరించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


నిర్మల్‌చైన్‌గేట్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఎన్నికల అధికారి ఆశిష్‌సంగ్వాన్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి చాంబర్‌లో ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ కేంద్రాల్లో 48 లొకేషన్లలో 61 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసి నగదు, మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతీ వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రోజువారీ కార్యకలాపాలపై తీసుకున్న చర్యలు, కేసుల నమోదు ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలన్నారు. నవంబర్ 30న జరిగే పోలింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఖానాపూర్ రిటర్నింగ్ అధికారి జీవాకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచాలి

సోన్: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచాలని సెక్టోరియల్ అధికారి శేఖర్, సోన్ ఎంపీడీవో మోహన్‌రెడ్డి సూచించారు. న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను శుక్రవారం పరిశీలించారు. ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచాలని, ప్రతీ బూత్‌లో విద్యుత్, తాగునీరు, వైద్యం, దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వారివెంట ఏఈఓలు అశోక్, అంబాజీ, కార్యదర్శులు భూపాల్‌రెడ్డి, లక్ష్మణ్, బీఎల్‌వోలు రాజమణి, రమాదేవి, అనురాధ, శకుంతల ఉన్నారు.

ఖానాపూర్ కాంగ్రెస్‌దే


- పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రకాశ్ రాథోడ్
- ప్రియాంకగాంధీ సభ ఏర్పాట్లు పరిశీలన



మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

ఖానాపూర్: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధి లోని ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రకాశ్ రాథోడ్ అన్నారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 19న ఖానాపూర్ మండలం సుర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించే ఎన్నికల ప్రచార సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరువుతారని తెలిపారు. ఖానాపూర్‌లో ఉదయం 10 గంటల సభకు హాజరుకావడంతోపాటు అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆసిఫాబాద్ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పార్టీ గెలుపుకు కీలకం కానున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టికెట్ ప్రకటించిన రెండు రోజుల్లోనే ఖానాపూర్‌లో గెలుపు ఖాయమైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి పాలన కారణంగానే ప్రజలు బీఆర్‌ఎస్‌ను గద్దెదించేందుకు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఖానాపూర్ ఇన్‌చార్జి ప్రజ్ఞానంద్ ఖడ్సే, నాయకులు దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, సతీశ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, స్వప్నిల్‌రెడ్డి, గుగ్లావత్ రాజునాయక్, జంగిలి శంకర్, సలీంఖాన్, షౌకత్‌పాషా, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించేందుకే కవాతు



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద/సారంగపూర్: ప్రజల్లో భరోసా కల్పించడానికే పోలీస్ కవాతు నిర్వహించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మణచాంద మండలం వడ్యాల్, రాచాపూర్, పీచర, మల్లాపూర్ గ్రామాల్లో, సారంగాపూర్ మండలం జామ్, స్వర్ణ గ్రామాల్లో బీఎస్‌ఎఫ్ పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో బీఎస్‌ఎఫ్ అధికారులను సన్మానించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడు తూ రానున్న ఎన్ని కల దృష్ట్యా ప్రజలల్లో భరోసాను కలగచేస్తూ ,తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకో వాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలాగా పోలీస్ శాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, సోన్ సీఐ నవీన్ కుమార్, సోన్, లక్ష్మణచాంద ఎస్సైలు శ్రీకాంత్, రవీందర్, సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది, బీఎస్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

వాహనం ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల జాతీయ రహదారి 44పై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. మావల ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తెలంగ్‌రావ్ ఈనెల 12న బైక్‌పై ఆదిలాబాద్‌కు వస్తున్నాడు. మావల బైపాస్ సమీపంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో గాయాలయ్యాయి. చికిత్స పొందిన ఆయన శుక్రవారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి గురైన బైక్ పట్టివేత



బైక్‌ను అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సై దేవేందర్

నిర్మల్‌టౌన్: మూడేళ్ల క్రితం చోరీకి గురైన బైక్‌ను పట్టుకున్నట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ తెలిపారు. వారి కథనం ప్రకారం..బైంసా పట్టణానికి చెందిన సూర్యవంశీ సంతోష్ బైక్‌ను మూడేళ్ల క్రితం బట్టిగల్లీ వద్ద దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో భైంసా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 12న నిర్మల్‌లోని మంచిర్యాల చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రిపుల్ రైడింగ్‌తో వస్తున్న పల్సర్ బైక్‌ని ఆపి ధ్రువపత్రాలు అడగగా తడబడ్డాడు. అనుమానం వచ్చి చాసిస్ నెంబర్ చూడగా తొలగించారు. ఇంజిన్ నెంబర్ పరిశీలించి థర్డ్ ఐలో ఎంట్రీ చేసి బైక్ యజమాని ఫోన్ నంబర్ కనుగొన్నారు. అతనికి ఫోన్‌చేసి బైక్ ధ్రువపత్రాలు తీసుకురాగా పట్టణ సీఐ పురుషోత్తం పరిశీలించి శుక్రవారం బైక్ అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ ఎస్సైలను సీఐ అభినందించారు.

బైక్ చోరీ



చోరీకి గురైన బైక్

భైంసా: బాసర రైల్వేస్టేషన్‌లో బైక్ చోరీకి గురైంది. బాసరకు చెందిన ఒని లక్ష్మణ్‌రావు బైక్ రైల్వేస్టేషన్‌లో నిలిపి హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తిరిగివచ్చేసరికి కనిపించలేదు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పాండ్రకు చెందిన బుర్కులే శంకర్ (30) రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. టూటౌన్ సీఐ అశోక్ కథనం ప్రకారం..భార్యతో గొడవపడి మనస్తాపం చెంది ఆయన పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

WANTED

■REQUIRED CIVIL CONTRACTORS IRP Infra Tech Pvt Ltd, a leading telecom infrastructure company, is looking for CIVIL CONTRACTORS to execute Civil Foundation works for Telecom Towers and Solar Structures in various parts of Andhra Pradesh. Interested contractors can apply by E-mail to: civilirp23@gmail.com or contact us at: 79812 72969 91604 42234 [OA-297]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

సగానికి పైగా విద్యావంతులే..



- ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..
- గెలిచి అభివృద్ధి చేయాలని తలచి వివిధ పార్టీల నుంచి బరిలోకి..

మంచిర్యాలటౌన్: వారంతా విద్యాధికులే.. ఉన్నత లక్ష్యంతో డిగ్రీ, పీజీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసినవారే. వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తూనే ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారు. ఆయా పార్టీలో చేరి ప్రస్తుతం అసెంబ్లీ బరిలో నిలిచారు. పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్రులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

మంచిర్యాల నియోజకవర్గంలో..

మంచిర్యాల నియోజకవర్గంలో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు 17 మంది బరిలో నిలువగా ఇందులో సగానికి పైగా ఉన్నత విద్యను అభ్యసించినవారే. ప్రధాన పార్టీల అభ్యర్థులు డిగ్రీ, ఆపైన చదివిన వారుండగా, ఉన్నత చదువు చదివి, మంచి ఉద్యోగాలు, వృత్తుల్లో ఉన్నవారు ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో 25 నుంచి 71 ఏళ్లవారున్నారు. వయస్సు, చదువుతో నిమిత్తం లేకుండా రాజకీయాల్లో రాణిస్తున్న వారెందరో ఉండగా, మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రం ఉన్నత చదువులతో పాటు, మంచి వృత్తిలో ఉన్నవారు కూడా ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజాసేవ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 51 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి అమెరికా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి పలు కంపెనీలను నెలకొల్పారు. ప్రస్తుతం ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. 63 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు బీఎస్సీ చదివి వ్యాపారం చేస్తున్నారు. 71 ఏళ్లున్న బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు బీఏ చదివారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసేవ చేస్తున్నారు. 41 ఏళ్లున్న బీఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్ బీఎస్సీ చదివి ఆర్ఎంపీగా, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 48 ఏళ్లున్న బహుజన రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి చెరుకూరి శాంతశ్రీ ఎమ్మెస్సీ ఎల్ఎల్‌బీ చదివి సోషల్ వర్క్ చేస్తున్నారు. 39 ఏళ్లున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి దొమ్మటి రవికుమార్ ఎమ్మెస్సీ చదివి వ్యవసాయం చేస్తూ బరిలో నిలిచారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు నలుగురు తలపడుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులుగా దుర్గం చిన్నయ్య, గడ్డం వినోద్, అమురాజుల శ్రీదేవి, జాడి నర్సయ్య పోటీలో ఉన్నారు. చిన్నయ్య, గడ్డం వినోద్, శ్రీదేవి ఇదివరకే ఎమ్మెల్యేలుగా గెలిచి చట్టసభలో అడుగు పెట్టారు. 52 ఏళ్లున్న బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యది వ్యవసాయ కుటుంబం. ఐటీఐ చదివి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. భార్య, ఇద్దరు కుమార్తెలు కలిగిన చిన్నయ్య మూడోసారి బరిలో ఉన్నారు. 67 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ రాజకీయ, పారిశ్రామిక కుటుంబంలో జన్మించారు. డిగ్రీ చదివిన వినోద్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ ఓసారి విజయం సాధించారు. ప్రస్తుతం బెల్లంపల్లి నుంచి రెండోసారి పోటీ చేస్తున్నారు. 51 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి సాధారణ కుటుంబంలో జన్మించారు. డిగ్రీ వరకు చదివారు. ఆమె భర్త రాజేశ్వర్ సింగరేణిలో అధికారిగా పని చేస్తున్నారు. ఆమెకు నలుగురు సంతానం. మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీదేవి పాత ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం నాలుగోసారి బరిలో ఉన్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో..

నిర్మల్‌ఖిల్లా/భైంసాటౌన్: 74 ఏళ్లున్న నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎల్ఎల్‌బీ పూర్తిచేసి న్యాయవాద వృత్తి స్వీకరించిన తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 54 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిగ్రీ పూర్తి చేశారు. 62 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఎల్ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం న్యాయవాద వృత్తిలో ఉండి రాజకీయాల్లోకి వచ్చారు. అలాగే బీఎస్పీ అభ్యర్థి డీ జగన్మోహన్ ఎల్ఎల్‌బీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి స్వదేశ్ పరికిపండ్ల, యుగ తులసి, ధర్మ సమాజ్, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ అభ్యర్థులు, స్వతంత్రులుగా బరిలో నిలిచిన వారంతా డిగ్రీ, పీజీ పూర్తి చేసినవారే.

ముధోల్ నియోజకవర్గంలో..

69 ఏళ్లున్న బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి దాదాపు 20 ఏళ్ల పాటు భైంసాలో న్యాయవాదిగా పనిచేశారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేశారు. 2009లో పీఆర్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన విఠల్‌రెడ్డి, 2014లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలుపొందారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరి, 2018లో గెలిచారు. 64 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి భోస్లే నారాయణరావుపటేల్ ఇంటర్ పూర్తి చేశారు. ముధోల్ ఎమ్మెల్యేగా రెండుసార్లు పని చేశారు. 69 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ డిగ్రీ పూర్తి చేశారు. 2018లో కాంగ్రెస్‌లో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అదే ఏడాది ముధోల్ బరిలో నిలిచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తదనంతరం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతూ గతేడాది బీజేపీలో చేరారు.

సిర్పూర్ నియోజకవర్గంలో..

కౌటాల: 68 ఏళ్లున్న సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప ఇంటర్ వరకు కాగజ్‌నగర్‌లో చదివారు. 48 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ 1 నుంచి 10వ తరగతి వరకు కాగజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. హైదరాబాద్‌లో ఇంటర్, డిగ్రీ బీఏ చదివారు. 44 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. 2004లో ఎంబీబీఎస్, 2010లో ఎంఎస్(ఆర్థోపెడిక్స్) పూర్తి చేశారు. 2011లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నుంచి డీఎన్‌బీ పట్టా పొందారు. 56 ఏళ్లున్న బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 1 నుంచి 10వ తరగతి వరకు ఆలంపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. వెటర్నరీ వైద్య వృత్తి కోర్సును హైదరాబాద్ ఎన్జీరంగ యూనివర్సిటీలో చదివారు. 1995లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. హార్వర్డ్ యూనివర్సిటీ ఇన్ పబ్లిక్‌లో ఉన్నత చదువు పూర్తిచేశారు. 2020 ఆగస్టు 8న తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీఎస్పీలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: 54 ఏళ్లున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి పదో తరగతి చదివారు. 36 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాంనాయక్ బీఎస్సీ(బీజెడ్సీ), మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ విద్యనభ్యసించారు. 53 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ బీఈ, బ్యాచ్‌లర్ ఆఫ్ జర్నలిజం (ఉస్మానియా), ఎల్ఎల్‌బీ శాతవాహన యూనివర్సిటీలో పూర్తిచేశారు. ఎంపీటీగా పనిచేసి ప్రజాసేవ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన భార్య రేఖానాయక్ ఖానాపూర్ ఎమ్మెల్యే.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వైన్ షాపు ముందు మృతిచెంది ఉన్న భోజరాం

భైంసాటౌన్: పట్టణంలోని గాంధీగంజ్ ఎదురుగా గల ఓ వైన్‌షాపు ముందు శుక్రవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కుభీర్ మండలం పార్డి(బి)కి చెందిన ఉమ్మె భోజరాం(25) వైన్స్ ముందు పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ సీఐ ఎల్.శ్రీను అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఏరియాస్పత్రికి తరలించారు. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తండ్రి చాంద్‌రాం పేర్కొన్నారు. వైన్ షాపులో సీసీ ఫుటేజీ పరిశీలించి పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

ఆటోబోల్తా పడి వృద్ధురాలి మృతి



లింగుబాయి (ఫైల్)

నార్నూర్: గాదిగూడ మండలం ఖడ్కి గ్రామం వద్ద ఆటో బోల్తాపడిన ఘటనలో వృద్ధురాలి మృతిచెందగా, పలువురి గాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. ఖడ్కి గ్రామానికి చెందిన ఉయక లింగుబాయి (60) అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తోంది. శుక్రవారం ఐసీడీఎస్ పని మీద లోకారి గ్రామానికి వెళ్లి తిరిగి ఆటోలో వస్తుంది. ఖడ్కి వద్ద ఆకస్మాత్తుగా ఎద్దు రావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లింగుబాయి అక్కడిక్కడే మృతిచెందింది. గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీడ్రైవర్‌కు ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వని శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్‌హెచ్‌వో రాజేష్ కథనం ప్రకారం.. 2015 డిసెంబర్ 31న జైపూర్‌కు చెందిన గోగు రాజేందర్ తన భార్య విజయలక్ష్మి కూతురు, కుమారుడితో బైక్‌పై మంచిర్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొంది. విజయలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. రాజేందర్, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. మహిళ మృతికి కారణమైన డ్రైవర్ శివకృష్ణకుమార్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ సహీన సుల్తానా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

కడ్తాల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కుమురం భీం పాత్రలో అజయ్

సోన్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్ధార్థ యోగా విద్యాలయం, సోషల్ ఫోరం వారు సంయుక్తంగా నిర్మల్ జిల్లా మంజులపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపన్యాస పోటీల్లో సోన్ మండలం కడ్తాల్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి యం. చైత్ర ప్రథమ స్థానంలో నిలిచింది . రూ.3 నగదు, ప్రశంసాపత్రం అందుకుంది. అదేవిధంగా కుమురంభీం ఏకపాత్రాభినయంలో జిల్లాస్థాయి పోటీలలో 10వ తరగతి విద్యార్థి అజయ్ ప్రతిభ కనబర్చాడు. జిల్లాస్థాయి అండర్–14 వాలీబాల్ విభాగంలో అక్షర ఉత్తమ ప్రతిభ కనబరిచంది. ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు



కృష్ణ (ఫైల్)

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట గ్రామానికి చెందిన యువకుడు సిరి పురం కృష్ణ ఈనెల 16న ఉదయం తాండూర్ ఐబీకి వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అతడికి ఫోన్ చేస్తే సెల్ స్విచాఫ్ వచ్చింది. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.



అవగాహన కలిగేలా..ఓటింగ్ పెరిగేలా

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈవీఎంల వినియోగంపై గ్రామగ్రామాన ప్రచార రథాల ద్వారా ఇప్పటికే అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా పట్టణప్రజలు బ్యాలెట్‌ను తెలుసుకుని ఓటు వినియోగించుకునే దిశగా కలెక్టర్ చౌక్‌లో నమూనా ఈవీఎంను ఏర్పాటు చేశారు. నమూనా బ్యాలెట్ పట్టణ ప్రజలను ఆకట్టుకుంటోంది. - సాక్షి, ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్

మీకు తెలుసా?

చాలెంజ్ ఓటు అంటే..?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'చాలెంజ్ ఓటు' (సవాల్ ఓటు) అనేది ఒకటి ఉంది అనేది మీకు తెలుసా?.. ఎన్నికల్లో ఎంతో కొంత ప్రభావితం చేసే 'చాలెంజ్ ఓటు' అంటే ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఓటరు జాబితాలో పేరున్నా.. ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయ పార్టీల ఏజెంట్లు సవాల్ చేయడాన్ని చాలెంజ్ ఓటు అంటారు. పోలింగ్ కేంద్రంలో కొంతమంది ఏజెంట్లు ఆ వ్యక్తి బోగస్ అని పోలింగ్ అధికారికి తెలియజేస్తారు. సదరు అధికారి ఫిర్యాదును పరిశీలించి ఏజెంట్ నుంచి రూ.5 ఫీజు తీసుకుని రసీదు ఇస్తారు. స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. కాగా, ఓటరు జాబితాలో అతడి పేరు, ఫొటో ఇతర వివరాలు సక్రమంగా ఉంటే ఓటు వేసేందుకు అర్హుడని తేలితే ఎన్నికల అధికారులు అనుమతిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

'ఎస్సీలను వర్గీకరిస్తే ఊరుకోం'



ఐక్యత చాటుతున్న మాల సంఘం నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీలను వర్గీకరిస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని మాల ప్రజాసంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ జీ చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. బీజేపీ కులరాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాయమాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మాల ప్రజాసంఘాల వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీధర్‌రావు, సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాజేశ్, వర్కింగ్ ప్రసిడెంట్ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు మధుకర్, మధు, ప్రభాకర్, ప్రతాప్, మురళి, జనార్దన్, ప్రదీప్, తిరుపతి ఉన్నారు.

అనాథలకు చేయూత



చిన్నారులకు సాయం అందిస్తున్న మిత్ర బృందం

ఖానాపూర్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలోని అనాథ చిన్నారులకు శుక్రవారం ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 పదోతరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో రూ.40 వేల ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. తమతో కలిసి చదువుకున్న మిత్రుడు సంగర్తి నాగలింగం(జాని) గల్ఫ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. జాని భార్య కవిత సైతం ఇటీవల ఇంట్లో విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. దీంతో వారి ఇద్దరి పిల్లలు అనాథలుగా మారారు. దీంతో శుక్రవారం నానమ్మ వద్ద ఉంటున్న ఆ చిన్నారులకు మిత్ర బృందం సాయం అందించారు.

ఓ వైపు పెళ్లిళ్లు.. మరో వైపు ఫైనల్‌మ్యాచ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 19 ఆదివారం శుభముహూర్తం కావడంతో జిల్లాలో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరగనున్నాయి. ఇప్పటికే పెళ్లిళ్లకు ఫంక్షన్ హాళ్లు మొత్తం బుక్ చేసుకున్నారు. ఆదివారమే ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కూడా ఉంది. దీంతో ఇటు పెళ్లిళ్లకు వెళ్లాలా?.. వరల్డ్ కప్ మ్యాచ్ చూడాలా?.. అన్న మీమాంసలో జనం ఉన్నారు. పెళ్లికి వెళ్లినా మ్యాచ్ కారణంగా త్వరగా ఇళ్లకు వెళ్లడంపై ఆలోచన చేస్తున్నారు. ఆదివారం వేళ ఎంచక్కా ఇంట్లో ఎంజాయ్ చేస్తూ భారత్–ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూసేలా క్రికెట్ అభిమానులు, వీక్షకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో వివాహాలు జరిపించే వారంతా పెళ్లికి వచ్చిన అతిథులు వెంటనే వెళ్తే ఫంక్షన్‌హాల్ బోసిపోతుందని గుర్తించారు. ఇంకేముంది పెళ్లికి వచ్చిన అతిథులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు వెళ్లిపోకుండా పెళ్లిళ్ల ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లపై క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కూడా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహానికి హాజరయ్యే బంధుమిత్రులకు మొబైల్ ఫోన్లలో కొంతమంది సమాచారం ఇవ్వడం కొసమెరుపు. ఏది ఏమైనా.. పెళ్లికి వచ్చిన బంధుమిత్రులు, అతిథులకు వినోదం, సంతోషం మిస్ కాకుండా చూస్తున్నారు.

తాగిన మైకంలో ఉరేసుకుని ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన మిట్ట రామయ్య (45) తాగిన మైకంలో గురువారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పని చేసే రామయ్యకు 20 ఏళ్ల క్రితం నారాయణపూర్‌కు చెందిన శారదతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రామయ్య రోజూ తన తల్లితోపాటు భార్యాపిల్లలతో గొడవపడేవాడు. ఇది భరించలేని శారద తన ఇద్దరు పిల్లలను నారాయణపూర్‌లోని తన పుట్టింటికి పంపించింది. అయినప్పటికీ రామయ్యలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఇటీవల అతడి తల్లి మరో కొడుకు ఇంటికి వెళ్లగా, శారద కూడా భర్తను వదిలి నారాయణపూర్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం శారద తిరిగి భర్త వద్దకు రాగా, ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్ తదితర సామగ్రి ధ్వంసమై ఉంది. ప్రశ్నించిన శారదను అప్పటికే మద్యం సేవించిన రామయ్య చితకబాదాడు. దీంతో శారద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రామయ్యపై కేసు నమోదైంది. ఈక్రమంలో తాగిన మైకంలో జీవితంపై విరక్తి చెందిన రామయ్య గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ ఏరియాలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాంటా చౌరస్తా శివారు ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మార్కెట్ ఏరియాకు చెందిన మహ్మద్ తాజ్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద 140 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

మంచిర్యాలఅర్బన్: ఈనెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోలో డ్రామా అంశంలో స్థానిక కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మనీషా అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయస్థాయికి ఎంపికైంది. శుక్రవారం కేజీబీవీలో మనీషాను కేజీబీవీ ఎస్వో స్వప్న జిల్లా విద్యాశాఖ అందించిన ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. జాతీయస్థాయిలో రాణించి గుర్తింపు తేవాలని సూచించారు. ఉపాధ్యాయినులు మనీషాను అభినందించారు.